


విద్యుత్ వెలుగుల్లో కాంతులీనుతున్న నిజామాబాద్ నగరంలోని శంభుని గుడి

## శివ పూజకు వేళాయె!

- నేడు మహాశివరాత్రి
- ఉమ్మడి జిల్లాలో ముస్తాబైన శైవక్షేత్రాలు

భక్తవశంకరుడు, భోళా శంకరుడు అయిన పరమేశ్వరుడి పూజకు వేళయ్యింది. మహాశివరాత్రి పర్వదిన వేడుకలకు నిజామాబాద్ నగరంలోని నీలకంఠేశ్వరాలయం, శంభునిగుడి, బోధన్‌లోని ఏక చక్రేశ్వరాలయం, ఆర్మూర్‌లోని సిద్ధుల గుట్ట, కామారెడ్డి జిల్లా భిక్కనూర్‌లోని సిద్ధరామేశ్వరాలయం, నాగిరెడ్డిపేట మండలం తాండూర్‌లోని త్రిలింగేశ్వరాలయం, రామారెడ్డి మండలంలోని మద్దికుంట బుగ్గ రామేశ్వరాలయం, తాడ్వాయి మండలం సంతాయిపేట భీమేశ్వరాలయం ముస్తాబయ్యాయి. విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు. ఉపవాస దీక్షలకు శివయ్య భక్తులు ఏర్పాట్లు చేసుకున్నారు.

–సుభాష్‌నగర్, ఫిబ్రవరి 25

# ఆర్టీసీ స్పెషల్ బాదుడు

### పండుగ పేరిట ప్రత్యేక చార్జీలు వసూలు
### ప్రయాణికుల జేబుకు చిల్లులు

కామారెడ్డి, ఫిబ్రవరి 25 : పండుగలు వచ్చాయంటే చాలు ఆర్టీసీ ప్రత్యేక చార్జీల పేరిట మోత మోగిస్తున్నది. అదనపు చార్జీలు వసూలు చేస్తూ ప్రయాణికుల జేబులకు చిల్లులు పెడుతున్నది. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడిపిస్తున్నది. కామారెడ్డి నుంచి ప్రముఖ పుణ్యక్షేత్రాలకు అదనపు బస్సులను నడుపుతూ అదనపు చార్జీలను వసూలు చేస్తున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించి ఆర్టీసీకి మేలు చేస్తున్నట్లుగా వ్యవహరించి, ఇప్పుడు పండుగ పేరిట అదనపు చార్జీలను వసూలు చేస్తున్నది. శివరాత్రి పర్వదినాన భక్తులు ఆయా శివాలయాలు ఉన్న పుణ్యక్షేత్రాలకు వెళ్తుంటారు. దీనిని అదునుగా చేసుకొని ప్రభుత్వం ప్రయాణికులపై అదనపు భారం మోపుతున్నది.

**చార్జీల పెంపు ఇలా..**

కామారెడ్డి నుంచి వేములవాడకు పల్లెవెలుగు రెగ్యులర్‌గా 14 బస్సులు ఉండగా అదనంగా 10 బస్సులను నడుపుతున్నారు. బస్సు చార్జి రూ.80 ఉండగా, ప్రత్యేక బస్సులకు 120 రూపాయలు వసూలు చేయనున్నారు. కామారెడ్డి నుంచి రామారెడ్డి మండలం మద్దికుంటకు ఒక బస్సు ఉండగా అదనంగా ఆరు బస్సులను నడపనున్నారు. బస్సు టికెట్ రూ. 30ఉండగా ప్రత్యేక బస్సులకు రూ.45 రూపాయలు వసూలు చేయనున్నారు. కామారెడ్డి నుంచి తాడ్వాయి మండలం సంతాయిపేట్‌కు ఒక బస్సు ఉండగా అదనంగా ఆరు బస్సులను నడుపనున్నారు. బస్సు టికెట్ రూ.30 ఉండగా ప్రత్యేక బస్సులకు 45 రూపాయలు వసూలు చేయనున్నారు. కామారెడ్డి నుంచి భిక్కనూర్‌కు 5 బస్సులు ఉండగా అదనంగా రెండు బస్సులు నడపనున్నారు. బస్సు టికెట్ 30 రూపాయలు ఉండగా ప్రత్యేక బస్సులకు 45 రూపాయలు వసూలు చేయనున్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో చాలా వరకు బస్సుల్లో మహిళల రద్దీ సంఖ్య పెరిగింది. ఇప్పుడు టికెట్ ధర అదనంగా చెల్లించినా సరిపడా బస్సులు లేక, సీట్లు దొరక్క ప్రయాణికులు నానా అవస్థలు పడే అవకాశాలు ఉన్నాయి.

**ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు..**

మహా శివారాత్రి సందర్భంగా ప్రయాణికుల సౌకర్యార్థం కామారెడ్డి నుంచి వేములవాడ, సంతాయిపేట్, మద్దికుంట, భిక్కనూర్‌కు 20 ప్రత్యేక బస్సులను నడపుతున్నాం. రెగ్యులర్‌గా నడిచే బస్సులతోపాటు ప్రత్యేక బస్సులను నడపనున్నాం. కేవలం ప్రత్యేక బస్సులో మాత్రమే అదనపు చార్జీలు వసూలు చేస్తున్నం. రద్దీని దృష్టిలో ఉంచుకొని మరిన్ని బస్సులను నడిపించడానికి ఏర్పాటు చేస్తున్నాం.


**-ఇందిరా, డిపో మేనేజర్, కామారెడ్డి**




### టీచర్, పట్టభద్రుల ఓట్ల కోసం వేట
### ఓటుకు రూ.5వేల చొప్పున కొనుగోలుకు యత్నం
### ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం
### బహిరంగంగానే బరితెగించిన జాతీయ పార్టీలు
### అదేబాటలో పలు ఉపాధ్యాయ సంఘాలు
### నిద్రావస్థలో ఎన్నికల యంత్రాంగం

**పట్టభద్రులు,** ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో డబ్బుల ప్రవాహం కొనసాగుతున్నది. పోలింగ్ తేదీ సమీపిస్తుండడంతో ఓట్ల వేటలో ప్రధాన జాతీయ పార్టీలు డబ్బులు వెదజల్లుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు నేరుగా ఓటర్లకు ఫోన్లు చేస్తూ రహస్య ప్రాంతాలకు రప్పించుకుంటున్నారు. రూ.5వేలు చేతిలో పెట్టి ఓట్లను అభ్యర్థిస్తూ ఎన్నికల్లో ప్రజాస్వామ్య స్ఫూర్తిని మంటగలుపుతున్నారు. ఎన్నికల్లో గెలిస్తే ఏం చేస్తామో చెప్పుకోవాల్సిన అభ్యర్థులు.. అవన్నీ పక్కనబెట్టి నోట్ల కట్టలతో ఓట్లను కొనుగోలు చేస్తున్నారు. కండ్ల ముందే ఇదంతా జరుగుతున్నా ఎన్నికల అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరించడం గమనార్హం.

–నిజామాబాద్, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)




ఎమ్మెల్సీ ఎన్నికల్లో ధన ప్రవాహం



# కాసులు.. గ్లాసులు!

పట్టభద్రులు, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రజాస్వామ్య స్ఫూర్తి కొరవడింది. ఎన్నికల యంత్రాంగం నిద్రావస్థలో ఉండడంతో పారదర్శకంగా జరగాల్సిన ఎన్నికల ప్రక్రియ వక్రమార్గంలో సాగుతున్నది. డబ్బు, మందు(లిక్కర్), విందు, చిందులతో ఓటర్లను ప్రస న్నం చేసుకుంటున్నారు. పోలింగ్ తేదీ సమీపిస్తుండడంతో రోజురోజుకూ ఓట్ల వేటలో ప్రధాన జాతీయ పార్టీలు విచ్చలవిడిగా డబ్బులు వెదజల్లుతున్నట్లు ఆరోపణలు గుప్పుమంటున్నాయి. పోటీలో ఉన్న అభ్యర్థులు నేరుగా ఓటర్లకు ఫోన్లు చేస్తూ రహస్య ప్రాంతాల్లో కలుస్తున్నారు. చేతిలో రూ.5వేలు పెట్టి ఓటు వేయాలంటూ అభ్యర్థిస్తున్నారు. గ్రూపులుగా భేటీలతోపాటు కుల సంఘాలు, విద్యా సంస్థల ద్వారా సమావేశాలు నిర్వహిస్తున్నారు. యువజన సంఘాలు, ఉపాధ్యా య సంఘాలతోనూ చర్చ జరుపుతూ పెద్ద మొత్తంలో డబ్బులు ముట్టజెబుతున్నట్లుగా ఆరోపనలు వెల్లు వెత్తుతున్నాయి. ఎన్నికల్లో గెలిస్తే ప్రజలకు తాము ఏం చేస్తామో చెప్పుకోవాల్సిన ఎమ్మెల్సీ అభ్యర్థులు.. అదం తా పక్కన పెట్టి,డబ్బుల కట్టలతోనే ఓట్లను కొనాలని నిర్ణయించుకున్నట్లు కనిపిస్తోంది. ఇదంతా తెలిసినా ఎన్నికల సంఘం అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి పర్యవేక్షణ కరువైంది.ఎమ్మెల్సీ ఎన్నికలు పారదర్శకంగా జరగాలంటే అభ్యర్థులు, వారి అనుచరులు, ఆయా పార్టీల నేతల ఇండ్లలో తనిఖీలు చేపట్టాలని ప్రజాస్వామ్యవాదులు కోరుతున్నారు.

**ఓటుకు రూ.5వేలు!**

ఎమ్మెల్సీ ఎన్నికల్లో జాతీయ పార్టీలకు గెలుపు అవకాశాలు లేకుండా పోయాయి. అదృష్టంపైనే ఆధారపడి ఎన్నికలను ఎదుర్కొనే దుస్థితి. పరువును నిలబెట్టుకునేందుకు ఆయా పార్టీలకు చెందిన ఎమ్మెల్సీ అభ్యర్థులు దొడ్డి దారిని ఎంచుకున్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తున్నారు. టెలీకాలర్లతో ఫోన్లు చేయించడంతో మొదలు పెడితే ఆయా రాజకీయ పార్టీల లీడర్ల సాయంతో ఓటుకు రూ.5వేలు వరకు వెచ్చిస్తున్నట్లు ప్రచారం జరుగుతున్నది. టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థులు సైతం నోట్ల కట్టలనే నమ్ముకున్నట్లు సమాచారం. బలమైన సంఘంగా చెప్పుకునే వారు ఓటుకు రూ.3వేలు పంచుతుండగా ఓ రాజకీయ పార్టీకి అనుబంధంగా ఉన్న అభ్యర్థి ఏకంగా రూ.5వేల చొప్పున డబ్బులిచ్చి ఓటర్లను తన గుప్పిట్లోకి తీసుకున్నట్లు తెలుస్తున్నది. గంప గుత్తగా తమ భావజాలం కలిగి ఉన్న ఓటర్లను గుర్తించి వారిని మచ్చిక చేసుకుని ప్రయోజనాలు కల్పిస్తుండగా.. మరోవైపు నిరంతర ఫాలోఅప్ చేస్తూ ఎలాగైనా తమకే ఓటు వేయాలంటూ ఓటర్లను అసహనానికి గురి చేస్తున్నారు. గెలిస్తే తాము ఏం చేస్తామో? వివరించకుండా, ఓట్లను కొనుగోలు చేయడంపైనే అభ్యర్థులు దృష్టిసారించడం గమనార్హం. జాతీయ పార్టీలకు ఎమ్మెల్సీ ఎన్నికలు కత్తిమీది సాములా మారడంతో ఓటర్లను ప్రలోభ పెట్టి ఎన్నికల్లో విజయావకాశాలను వెతుక్కుంటున్నాయి. గ్రామాల్లో ఆయా పార్టీల మండల అధ్యక్షులకు బాధ్యతలు అప్పగించి ఓటరు జాబితాను అనుసరించి ఫోన్లు చేసి అమ్యామ్యాలను అప్పగిస్తున్నట్లు సమాచారం. మంగళవారం సాయంత్రం 4 నుంచి 27వ తేదీ సాయంత్రం వరకు వైన్ షాపులను ఎన్నికల కమిషన్ మూసేయించింది. మూసివేతకు ముందే భారీగా మద్యం బాటిళ్లు డంప్ అయినట్లు తెలిసింది.

**దారితప్పిన ఉపాధ్యాయ సంఘాలు**

సమాజానికి నీతులు బోధించే ఉపాధ్యాయ వర్గాలు సైతం దారి తప్పి ప్రవర్తిస్తున్నాయి. ఫక్తు రాజకీయ పార్టీలకు సమానంగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తుండడం గమనార్హం. సభలు, సమావేశాల్లో మందు, విందులు ఏర్పాటు చేస్తూ టీచర్ ఓటర్లను రాబట్టుకునేందుకు పాకులాడుతున్నాయి. కొంత మంది తీరు సభ్య సమాజం తల దించుకునేలా చేస్తున్నది. ఓటును అమ్ముకోవద్దంటూ విద్యార్థులకు సూక్తులు చెప్పే వర్గమే ఓటును బహిరంగ వేలం మాదిరిగానే అమ్మకానికి పెట్టడం విమర్శలకు తావిస్తున్నది. ప్రధాన ఉపాధ్యాయ సంఘాల నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థులందరూ ఇదే ధోరణితో దూసుకుపోతున్నారు. ఆయా రాజకీయ పార్టీల మద్దతుతో ఎన్నికల బరిలో నిలిచిన వారంతా ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు డబ్బులు వెదజల్లుతున్నారు. దీంతో ప్రజాస్వామ్యంలో కీలకమైన ఎన్నికల ఘట్టం నవ్వుల పాలవుతున్నది. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో కొద్ది రోజులుగా ఈ తంతు నడుస్తున్నది. మరోవైపు ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో చాలా మంది ఉపాధ్యాయులు దొడ్డి దారిలో విధులకు డుమ్మా కొట్టి ప్రచార పర్వంలో భాగస్వామ్యం అవుతున్నట్లు సమాచారం. వార్షిక పరీక్షలు దగ్గర పడిన కీలక సమయంలో ప్రభుత్వ టీచర్లు వక్రమార్గంలో విధులకు డుమ్మా కొట్టడంపైనా సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మహిళా టీచర్ల ఓట్లను సైతం తమదైన శైలిలో రాబట్టుకునేందుకు బహుమతులను సిద్ధం చేసినట్లు తెలిసింది. వారికి నేరుగా డబ్బులు ఇస్తే, ప్రయోజనం ఉండదని భావించి గిఫ్ట్ కూపన్లు, ఇతరాత్ర బహుమతులను ఇంటికే పంపించేలా కొన్ని ఉపాధ్యాయ సంఘాలు ప్రయత్నిస్తున్నట్లుగా సమాచారం.

### పేద కుటుంబానికి
# అండగా కేటీఆర్

- చిన్నారుల వైద్య ఖర్చులు భరించిన మాజీ మంత్రి
- ధన్యవాదాలు తెలిపిన తల్లిదండ్రులు



దవాఖానలో చికిత్స పొందుతున్న సంజన, బిందును పరామర్శిస్తున్న బీఆర్ఎస్ పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య

రామారెడ్డి, ఫిబ్రవరి 25: కూల్‌డ్రింక్ అనుకుని గడ్డిమందు తాగి దవాఖాన పాలైన ఇద్దరు చిన్నారులకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అండగా నిలిచారు. పార్టీ నేతలను దవాఖానకు పంపించి వారి వైద్యానికి అయిన ఖర్చును చెల్లించారు. రామారెడ్డి మండలం స్కూల్‌తండాకు చెందిన గంగావత్ మంత్‌కు భార్య, ఇద్దరు కూతుళ్లు సంజన(10), బిందు(7) ఉన్నారు. మంత్ ఉన్న 25 గుంటల భూమిలో వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. పొలానికి కొట్టేందుకని ఇటీవల ఫర్టిలైజర్ షాప్ నుంచి కొనుక్కొచ్చిన మందును థమ్సప్ బాటిల్‌లో నింపి పెట్టాడు. శనివారం స్కూల్ నుంచి వచ్చిన ఇద్దరు కూతుళ్లు థమ్సప్ బాటిల్‌ను చూసి కూల్‌డ్రింక్‌గా భావించి తాగారు. తీవ్ర అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన కామారెడ్డి దవాఖానకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట ప్రైవేట్ దవాఖానలో చేర్పించారు. నాలుగు రోజులుగా చికిత్స పొందిన తర్వాత అక్కాచెల్లెలు కోలుకున్నారు. అయితే, పేదరికంలో కొట్టుమిట్టాడుతున్న తల్లిదండ్రులు ఫీజు కట్టేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ విషయం తెలిసిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. రాజన్న సిరిసిల్ల జిల్లా పార్టీ అధ్యక్షుడు తోట ఆగయ్యను దవాఖానకు వెళ్లాలని ఆదేశించారు. కేటీఆర్ ఆదేశాలతో మంగళవారం దవాఖానకు వెళ్లిన ఆగయ్య చిన్నారుల తల్లిదండ్రులను పరామర్శించారు. పిల్లల వైద్యానికి అయిన ఖర్చును చెల్లించి దగ్గరుండి డిశ్చార్జి చేయించి ఇంటికి పంపించారు. కేటీఆర్‌కు, పార్టీ నేతలకు చిన్నారుల తల్లిదండ్రులు ధన్యవాదాలు తెలిపారు.

# పోటెత్తిన పచ్చబంగారం

**నిజామాబాద్** మార్కెట్ యార్డుకు 'పసుపు' పోటెత్తింది. శివరాత్రి, అమావాస్య సందర్భంగా వరుసగా సెలవులు ఉండడంతో మంగళవారం రైతులు పెద్దమొత్తంలో పసుపు పంటను మార్కెట్ యార్డుకు తీసుకువచ్చారు. దాదాపు 45 వేల బస్తాల పసుపు కొనుగోళ్లు జరిగాయి. – కంఠేశ్వర్, ఫిబ్రవరి 25



నిజామాబాద్ మార్కెట్ యార్డులో జోరుగా విక్రయాలు

### నిజామాబాద్, కామారెడ్డి కలెక్టర్లు రాజీవ్‌గాంధీ హన్మంతు, ఆశీష్ సంగ్వాన్

### ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు
# ఏర్పాట్లు పూర్తి

కంఠేశ్వర్, కామారెడ్డి, ఫిబ్రవరి 25: నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో ఈ నెల 27న నిర్వహించనున్న ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు కలెక్టర్లు రాజీవ్‌గాంధీ హన్మంతు, ఆశీష్‌సంగ్వాన్ తెలిపారు. మంగళవారం వారు వేర్వేరుగా మాట్లాడారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా ఎన్నికల ప్రక్రియ కొనసాగేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి నిజామాబాద్ జిల్లాలో 31,571 మంది ఓటర్లుండగా ఉపాధ్యాయ నియోజకవర్గ ఓటర్లు 3751 మంది ఉన్నారని తెలిపారు. పట్టభద్రుల నియోజకవర్గానికి 48,ఉపాధ్యాయ సెగ్మెంట్‌కు 33 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు రాజీవ్‌గాంధీ హన్మంతు పేర్కొన్నారు. ఓటర్ల సౌలభ్యం కోసం ఉపాధ్యాయ, పట్టభద్రుల పోలింగ్ స్టేషన్లు ఒకే ప్రాంగణంలో ఉండేలా ఏర్పాటు చేశామని చెప్పారు. కామారెడ్డి జిల్లాలో ఎమ్మెల్సీ పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి 16,410 మంది, ఉపాధ్యాయ నియోజకవర్గానికి సంబంధించి 2011 మంది ఓటర్లు ఉన్నారని కలెక్టర్ ఆశీష్‌సంగ్వాన్ తెలిపారు. 27న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగుతుందని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు ఉన్నవారు ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. నిజామాబాద్ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు పరిశీలించారు. మంగళవారం ఎన్నికల సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకున్నారని తెలిపారు. కామారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ పరిశీలించారు.



బ్యాలెట్ ప్రక్రియను పరిశీలిస్తున్న నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

**ఎన్నికలకు పటిష్ట బందోబస్తు: కామారెడ్డి ఎస్పీ సింధూశర్మ**

కామారెడ్డి, ఫిబ్రవరి 25 : ఎమ్మెల్సీ ఎన్నికలకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ సింధూ శర్మ మంగళవారం తెలిపారు. ఎన్నికల కోసం నలుగురు డీఎస్పీలు, 80 మంది సీఐలు, 33 మంది ఎస్సైలు, 58 మంది ఏఎస్సైలు,హెడ్ కానిస్టేబుళ్లు,174 మంది కానిస్టేబుళ్లు,35 మంది హోంగార్డులు మొత్తం 312 మంది సిబ్బందిని నియమించినట్లు పేర్కొన్నారు. సీసీ కెమెరాలతో పర్యవేక్షణ ఉంటుందని అన్నారు.ఎన్నికల సమయంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద 100, 200 మీటర్ల పరిధిలో ఎన్నికల నియమావళి ప్రకారం ఆంక్షలు ఉంటాయని పేర్కొన్నారు.

# కామారెడ్డిలో విషాదం

**సైకిల్ తొక్కుకుంటూ వెళ్లి.. నీటి కుంటలో పడి ఇద్దరు చిన్నారుల మృతి**

కామారెడ్డి, ఫిబ్రవరి 25 : కామారెడ్డి పట్టణంలో విషాదం నెలకొన్నది. మున్సిపల్ పరిధిలోని రామేశ్వర్‌పల్లిలో ఇద్దరు చిన్నారులు సైకిల్ తొక్కుకుంటూ వెళ్లి కుంటలో పడి మృతి చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకున్నది. దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన జగన్నాథం నాగరాజు కుమారుడు శివ(10), గ్రీన్‌సిటీ కాలనీకి చెందిన కుంభ నాగేంద్రబాబు పెద్ద కుమారుడు సంతోష్(8) చేపలు పట్టడానికి సైకిల్‌పై ఆడుకుంటూ వెళ్లారు. ఈ క్రమంలో రామేశ్వర్‌పల్లిలోని ఓ నీటి కుంటలో ప్రమాదవశాత్తు కాలు జారి పడి మృతి చెందారు. కాలనీవాసుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను బయటికి తీయించారు. మృతదేహాలను చూసి కుటుంబ సభ్యులు బోరున విలపించారు. పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు ఎస్సై తెలిపారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

**శోకసంద్రంలో బాధిత కుటుంబాలు**

ఇందిరానగర్ కాలనీకి చెందిన జగన్నాథం నాగరాజు కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు భార్య, ఇద్దరు కూతుళ్లు, ఇద్దరు కుమారులు ఉన్నారు. నాగరాజు పెద్ద కుమారుడు శివ. గ్రీన్‌సిటీ కాలనీకి చెందిన కుంభ నాగేంద్ర బాబు కూలి పని చేసుకుంటు జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు భార్య, ఒక పాప, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు సంతోష్. మంగళవారం శివ, సంతోష్ కలిసి చేపలు పట్టడానికి సైకిల్‌పై వెళ్లి మృత్యువాత పడడంతో రెండు కుటుంబాల రోదనలు మిన్నంటాయి. చిన్నారుల మృతితో రెండు కాలనీల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.